25—1—85 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

# మినీ కథ

## నరనరాల్లో....

టెక్నో సత్యం-నేనిక్




బస్సు కిటకిట లాడిపోతోంది. ఉదయం తొమ్మిదిన్నర. ఆఫీసులకు వెళ్ళేవేళ. అంత రద్దీలోను పద్మవ్యూహంలో అభిమన్యుడులా కండక్టర్ అటూ ఇటూ పోటు చేసుకుంటూ టికెట్లు ఇస్తున్నాడు. టికట్ టికట్ అంటూ చిటికలు గాలిలో కలిసిపోతున్నాయి. పుట్‌బోర్డు మీద వేలాడు షర్టులు పాంటులు లోపలికి రాకుండా వేలాడుతున్నాయి. కండక్టర్ దగ్గరకొచ్చాడు. ముషీరాబాద్ నుంచి చార్మినార్ చౌరాస్తాకు నలుగురికి కలిపి అరవై పైసలు చేతిలో పెట్టారు. కళ్ళసైగలు, కొంటె నవ్వులు ఒకరి భాష ఒకరికి అర్థమైంది. చిల్లర బాగ్‌లోకి వెళ్ళిపోయింది. టికట్ చించబడలేదు. ఎదురుగా "మినిమమ్ ఫేర్ 30 పైసలు" -- రాసిన గీతలు ఒంకరతిరిగికళ్ళుమూసుకున్నాయి. చార్మినార్ చౌరాస్తా వచ్చింది. నల్గురు దర్జాగా దిగి వెళ్ళిపోయారు. అంతే! అంతా సవ్యంగానే జరుగుతోంది! సబ్ ఠీక్ హై!!

* * *

అది వానాకాలం. రాత్రి 9 గంటలు! బస్సులో జనం పలచగా వున్నారు. బయట వాన కురుస్తోంది. బస్‌స్టాప్‌ల్లో కూడా జనం తక్కువగానే వున్నారు. బస్సు వేగంగా దూసుకుపోతోంది కోటీ నుండి సనత్ నగర్‌కు! కోటీలో ఎక్కాను. ఎర్రగడ్డకు పోవాలి. రోజూ వెళ్ళే రూటు. టికెట్ 80 పైసలు. రూపాయి తీసి ఇచ్చాను. నవ్వుతూ 50 పైసలు తిరిగి ఇచ్చాడు కండక్టర్. టికట్ అడిగాను. "ఫరవాలేదులెండి. ఈ వానలో ఎవరు చూడొచ్చారు"-అంటూ ముందుకు జరిగిపోయాడు. -అంతే అది వాళ్ళ "మామూలు" దారి. -సవ్యంగానే జరిగిపోతోంది!! సబ్ ఠీక్ హై!!

* * *

బస్సు ఫుల్‌లోడ్‌లో పోతోంది. అకస్మాత్తుగా సందులోంచి టికట్ చెకింగ్ మాస్టరు వచ్చి బస్సునాపు చేశాడు. ఫటాఫట్ టికట్‌లు చెక్ చేశాడు. టికట్ లేకుండా నలుగురు దొరికిపోయారు. కండక్టరు, పాసెంజర్లు తాము ఇంతకుముందు స్టాపులోనే ఎక్కామని బుకాయించాడు. కండక్టరును కిందికి పిల్చి దబాయించాడు. టి. సి. రిపోర్టు రాస్తానని బెదిరించాడు. ఇద్దరు కొంచెం పక్కకు జరిగారు. పైసలు చేతులు మారాయి. టికట్ మాస్టరు మరో వేటకోసం సందులోకి పోయాడు. కండక్టరు ముఖం మాడిపోయింది. డ్రైవరు దగ్గరకు వచ్చి "ఏమన్నా, కనీసం వుషారు చేయక పోతివి. వాణ్ణి సముదాయించే టప్పటికి తలప్రాణం తోకకు వచ్చింది" అని సణుక్కొంటున్నాడు. అయితేనేం అంతా సవ్యంగానే జరిగిపోయింది! సబ్ ఠీక్ హై!!

* * *

సిటీలో స్టూడెంట్సు స్ట్రైక్ నడుస్తోంది. "వురుము వురిమి మంగలం మీదపడ్డట్టు" వాళ్ళ కోపానికి బస్సులు ఆహుతి అయిపోయాయి. అద్దాలు పగిలిపోయాయి. లోపల సీట్లు చగలబెట్టారు. సాయంకాలానికి నెమ్మదిగా "గాయపడిన సైనికుల్లా" బస్సులను డిపోకి తీసుకు వచ్చారు. స్టోర్సు ఆఫీసరు అప్పలసామి తన అసిస్టెంటును పిలిచి "మంత్రోపదేశం" చేశాడు. ఒక గంటలో బాగావున్న టైర్లకు బదులు, పాత టైర్లు బస్సులకు ఎక్కించారు. రాత్రికి రాత్రి మంచి 8 టైర్లు బయట మార్కెట్టులో అమ్మటం-స్టాక్‌లోకి 8 పాత టైర్లు చేరిపోవటం జరిగింది- అంతాసవ్యంగానే! సబ్ ఠీక్ హై!!

* * *

పాత బస్సుల అమ్మకానికి ఆ రోజు వేలం జరగబోతోంది. ప్రైవేటు బస్సుల యజమానులు, బడా బడా సేట్లు- ఆ పాత బస్సుల చుట్టు చేరి శల్య పరీక్ష చేస్తున్నారు. వాళ్ళ కళ్ళు దూరంగా వుంచబడిన కొద్దిగా బాడీ దెబ్బ తిన్న బస్సుల మీద పడింది. ఇంజను మంచి రన్నింగు కండిషనులో వుంది. ఇంకా ఏం. మెల్లిగా గుస గుసలు-చిటాకులు-కాష్ బాగ్‌ల మార్పిడి క్షణాల మీద జరిగిపోయింది- వేలం లిస్ట్‌లో వాటినికూడా చేర్చటం తక్కువరేటుకు వాటి వేలం జరిగిపోవటం జరిగిపోయింది- అంతా సవ్యంగానే! సబ్ ఠీక్ హై!!

* * *

ఆ రోజు మంత్రిగారి పి.ఎ. సీనియర్ ఆఫీసర్ల నందరిని మంత్రిగారితో మీటింగు వుందని పిలిపించాడు. కొత్తగా 8 డిపోలు తెరపబోతున్నారని, వీలునిబట్టి డిపో మేనేజర్లుగా ప్రమోషన్లు రావచ్చని, ఎవరి శక్తి వాళ్ళు ప్రయత్నం చేసుకోమని విడివిడిగా ఒక్కొక్కరికి విపులీకరించాడు. అంతే వారం రోజుల్లో కొత్త డిపో మేనేజర్ల ఎపాయింటుమెంట్ ఆర్డర్లు వాళ్ళకు; ఇటు మంత్రిగారి జేబులోకి కొంచెం పి.ఎ. గారి జేబులోకి ఎవరి వాటాలు వాళ్ళకి సవ్యంగానే వెళ్ళిపోయాయి.

* * *

ఆ విధంగా జాతి నరనరాల్లో ఈ మార్పిడి సవ్యంగానే జరిగిపోతూనే వుంది! సబ్ ఠీక్ హై!! హైన!!!

★